

ప్రజా న్యూస్
నెట్ వర్క్
దినపత్రిక

సంపుటి :01,సంచిక : 187,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,బుధవారం, తేదీ : 11-11-2026

PUBLISHED BY HYDERABAD : Circulation Areas:TELANGANA & ANDHRA PRADESH

రాజీవ్ గాంధీ దారుణ హత్య ఫోటోను
ఇప్పటి వరకు చూడలేదు

- తన భర్త రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఆయన మృతదేహం చిత్రాన్ని ఇప్పటివరకు చూడలేదని సోనియా గాంధీ వెల్లడించారు.
- తన ఆత్మకథ బిలాంగింగ్‌లో ఈ విషయాన్ని తెలిపారు.



ఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు, అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో ఎన్నో ముఖ్యమైన సంఘటనలకు సంబంధించి వివరాలను పంచుకున్నారు. భారత మాజీ ప్రధాని, తన భర్త రాజీవ్ గాంధీ హత్యకు గురై 3 దశాబ్దాలు దాటినా ఇప్పటివరకు ఆ మృతదేహం ఫొటోను చూడలేదని సోనియా గాంధీ తెలిపారు. తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఆ ఫొటో తన కంట పడకుండా చాలా జాగ్రత్తపడ్డారని పుస్తకంలో వెల్లడించారు. ఇప్పటికీ అవే జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇరువురూ తనను కాపాడాల్సిన బాధ్యతను తీసుకున్నారని ఆ పుస్తకంలో వెల్లడించారు. 1991 మే 21న తమిళనాడు శ్రీ పెరంబుదూరులో ఎన్నికల ప్రచార సభకు హాజరైన రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురయ్యారు. ఎల్‌టీటీఈకి చెందిన ఒక మహిళా ఆత్మాహుతి దళ సభ్యురాలు పూలమాల వేసే నెపంతో ఆయన దగ్గరికి వెళ్లింది. తన శరీరానికి పేలుడు పదార్థాలు అమర్చుకొని మిగతా..2లో

ఢాకాలోని స్లమ్ ఏరియాలను
దిల్లీలో ఉన్నట్లు చూపిస్తారా?'



- బంగ్లాదేశ్‌లోని పేద ప్రాంతాలను చైనా వ్లాగర్లు చిత్రీకరించి, ఆ ఫుటేజీని దిల్లీలోని దృశ్యాలుగా ప్రచారం చేస్తున్నారన్న వార్తలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడలు, పేదలున్న ప్రాంతాలను వీడియోలు తీస్తూ వాటిని సోషల్ మీడియాలో దిల్లీగా చూపిస్తున్న చైనా వ్లాగర్ల పట్ల, అలాంటి ఘటనల పట్ల భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ దేశ చిత్రాన్నైనా ఇలా వక్రీకరించి చూపించే ప్రయత్నాలు చేయడం మిగతా..2లో

వాయు కాలుష్యంలో ఎందుకు 'విశ్వగురువులం' అవుతున్నాం

- వాయు కాలుష్యంలో దిల్లీ విశ్వగురువుగా ఎందుకు మారుతోందని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.
- కాలుష్యం కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు.

దేశ రాజధాని దిల్లీలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వాయు కాలుష్యంలో దిల్లీ విశ్వగురువుగా ఎందుకు మారుతోందని ప్రశ్నించారు. కాలుష్యం కట్టడి చేయడంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. దీపావళి అనంతరం పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం వల్ల దిల్లీలో కాలుష్య స్థాయిలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యానించారు.



"2019 మే 8న ప్రధాని మోదీ వాయు కాలుష్యాన్ని 'ప్రధాన సవాలు'గా గుర్తించారు. కానీ ఆయన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అరకొర చర్యలు, ఇతరులపై నిందలు వేయడమే బీజేపీ మార్క్‌గా మారిపోయింది. దిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి ఉత్తర్ ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్ వరకు ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడుతున్నారు. వాస్తవాలు ఎంత ఆందోళనకరంగా ఉన్నాయో, అంతే సిగ్గుచేటుగా కూడా ఉన్నాయి. నివేదికల ప్రకారం, 2023లో దిల్లీలో సంభవించిన 17,188 మరణాలకు వాయు కాలుష్యమే కారణం. ఇది మొత్తం మరణాల్లో దాదాపు 15 శాతం. అలాగే, 2021లో భారతదేశం అంతటా, ఐదేళ్లలోపు వయసున్న 1,69,400 మంది పిల్లలు వాయు కాలుష్య సంబంధిత కారణాలతో మరణించారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో pm2.5 ప్రభావానికి గురికావడం వల్ల ఊపిరితిత్తులు మిగతా..2లో

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి..
భూదార్ నంబర్ల కేటాయింపుపై
పొంగులేటి కీలక ఆదేశాలు



- భూ రీసర్వే వల్ల చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదానికి కారణం కాకూడదని అధికారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.
- మంగళవారం తెలంగాణ సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- 416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి.. భూదార్ నంబర్ల కేటాయింపుపై పొంగులేటి కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్10: భూ రీసర్వే వల్ల చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదానికి కారణం కాకూడదని అధికారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మర్చిపోవద్దు
నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

- శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు.
- ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు.



గతంలో గ్రూప్-1 నియామకాల ప్రక్రియ చాలా ఆలస్యంగా జరిగేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి తీరని నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, నియామక ప్రక్రియ చేపట్టినట్లు గుర్తు చేశారు. గతంలో రాజకీయ పునరావాస కేంద్రంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉండేదని విమర్శించారు. అవగాహన లేనివారిని బోర్డులో నియమించి గత ప్రభుత్వం తప్పు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మరిచిపోవద్దని నూతన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, భద్రత సలహాదారు శివధర్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని సీఎం అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో నూతన డీఎస్పీల చేతుల్లోనే ఉందన్నారు. అధికారుల నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయని వ్యాఖ్యానించారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే ఆరోపణలు వస్తాయన్నారు. శాంతిభద్రతలు క్షీణించి మిగతా..2లో

కరవుతో ఇబ్బందుల్లో రైతులు..
పంట రుణాల రీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు



- రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.
- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని..
- రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 10: రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. (మంగళవారం) ప్రజా భవన్‌లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని.. రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని... అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. మిగతా..2లో

ధైర్యంగా కోలుకుంటోంది.. రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్



రాప్తాడు దాడి బాధితురాలికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందన్న లోకేశ్

గాయాలు మానుతున్నాయని, చేతి కదలికలు మొదలయ్యాయని వెల్లడి

త్వరలో పీఐసీయూ నుంచి జనరల్ వార్డుకు మార్పు

అమరావతి: రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో మానసిక రోగి దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధితురాలు వేగంగా కోలుకుంటోందని ఆయన తెలిపారు. వైద్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గాయాలకు సంబంధించిన డీబ్రిడ్‌మెంట్, కుట్లను సరిచేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని లోకేశ్ పేర్కొన్నారు. బాలిక గాయాలు క్రమంగా నయమవుతున్నాయని, ఎడమ చేతికిమిగతా..2లో

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత



ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత

వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం

హదరాబాద్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... మిగతా..2లో

13న బంగాళాఖాతంలో అల్పపీడనం
ఏర్పడే అవకాశం - మత్స్యకారులు
వేటకు వెళ్లొద్దని హెచ్చరిక



- ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.
- ఇది వాయవ్య దిశగా పయనించి, అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు.

అమరావతి: ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు
కేబినెట్ కీలక నిర్ణయాలివే

- భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్, కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదం కీలక పరిపాలనా నిర్ణయాల దిశగా కేబినెట్ సమావేశం జరిగింది.
- ఈ భేటీలో 30కి పైగా అంశాలపై మంత్రివర్గం చర్చించింది.





అమరావతి : రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో పాటు భారీ పెట్టుబడులు ఆకర్షణే ప్రధాన అజెండాగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీ, ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో కొత్త విధానాలకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ విధానంలోనూ మార్పులకు పచ్చజెండా ఊపారు. విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, పట్టణాభివృద్ధి, పోలీసు వ్యవస్థలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఐటీ, ఏఐ, రోబోటిక్స్, సెమీకండక్టర్ రంగాలకు సంబంధించి 3 కీలక విధాన నిర్ణయాలు తీసుకుంది. 2026-31 ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026-2036 రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ విధానానికీ పచ్చజెండా ఊపింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0లో సవరణలకు ఆమోదముద్ర వేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఈ-ప్యాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్ సంస్థకు అనుమతులు మంజూరు చేసింది. మాడ్యులర్ ఎక్విప్‌మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.570.20 కోట్లు కాగా 2,565 మందికిమిగతా..2లో

తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం'
వివరాలు వెంటనే నమోదు చేయాలి



అర్నబ్, మురసు తుపాన్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

అమరావతి: అర్నబ్, మురసు తుపాన్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క రైతు కూడా మిగిలిపోకుండా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెండు తుపాన్ల ప్రభావంతో రాష్ట్రంలో మొత్తం 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అర్నబ్ తుపానుతో భారీ నష్టం : అర్నబ్ తుపానుతో 3,27,843 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 5,23,136 మంది రైతులపై ప్రభావం పడింది. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం'
వివరాలు వెంటనే నమోదు చేయాలి

ఈ తుపాను వల్ల వ్యవసాయ పంటలకు ఏకంగా రూ.2,392.84 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. మురసు తుపానుతో 1,33,351 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 1,86,269 మంది రైతులపై ప్రభావం పడింది. 29,960 హెక్టార్లలో నష్టం : రెండు తుపాన్లతో కలిపి 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అర్నబ్ తుపాను ఉద్యాన పంటల నష్టాల ఎన్యుమరేషన్ 99.24 శాతం పూర్తయింది. కానీ, మురసు తుపాను నష్టాల నమోదు మాత్రం 32.77 శాతమే పూర్తయిందని అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మురసు నష్టాల నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే భర్తీ చేసి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని సూచించారు. నష్టాల నమోదు పూర్తయిన వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది వాయవ్య దిశగా పయనించి, తర్వాత 24 గంటల్లో బలమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఈ నెల 14, 15 తేదీల్లో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో అలల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. 14, 15 తేదీలలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే రెండు వరుస తుపాన్లను చవిచూసిన రాష్ట్ర ప్రజలు, తాజా అల్పపీడనంతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. తాజాగా ఏర్పడిన అల్పపీడనం రాష్ట్రంపై చూపించే ప్రభావం, గమనంపై ఇప్పుడే ఓ నిర్ణయానికి వచ్చే పరిస్థితి లేదు. అల్పపీడనం గమనాన్ని వాతావరణ శాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

ధైర్యంగా కోలుకుంటోంది..
రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్

ఉన్న స్లింగ్‌ను తొలగించడంతో ఆమె నెమ్మదిగా చేతిని కదిలిస్తోందని చెప్పారు. ఆ చిన్నారి ఎంతో ధైర్యంతో చికిత్సకు సహకరిస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆమెకు నొప్పి నివారణ మందులు, ఫీడింగ్ సపోర్ట్ అందిస్తున్నారని.. త్వరలోనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) నుంచి జనరల్ వార్డుకు మార్చుతారని మంత్రి పేర్కొన్నారు.

కరవుతో ఇబ్బందుల్లో రైతులు..
పంట రుణాల లీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు

ఆ పంటలకు రుణాలు అందించాలి

రబీ సీజన్‌కు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని భట్టి సూచించారు. బ్యాంకుల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని.. 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలకు రుణాలు అందించాలని.. పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు

రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలపై పరిశీలన చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నెల 19 నాటికి రాజీవ్ యువ వికాసం అమలుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి..
భూదార్ నంబర్ల కేటాయింపుపై పొంగులేటి కీలక ఆదేశాలు

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులే లక్ష్యమని పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూదార్ నంబర్ల కేటాయింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అధికారులంతా పారదర్శకత, కచ్చితత్వంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి కోరారు. తెలంగాణలో ప్రస్తుతం సమగ్ర భూ రీసర్వే వెయ్యి గ్రామాలు దాటిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. భూ యజమానుల ప్రయోజనాలకే సర్వేలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగానే భూ సర్వే ప్రారంభించాలని పేర్కొన్నారు. సర్వే పూర్తయ్యాక భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని తెలిపారు. అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు భూ యజమానులకు అవకాశం కల్పించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే రైతులకు సర్వే విధానం, అభ్యంతరాల పరిష్కారంపై అవగాహన కల్పించాలని కోరారు. తొలి దశలో 2,720 గ్రామాల్లో ప్రభుత్వం భూ రీసర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. 125 ఏళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం విదితమే.

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

విదేశాల నుంచి 73 మంది డిపోర్టేషన్

ఉగ్రవాదులకు విదేశీ ఆశ్రయాలు లభించకుండా దౌత్యపరమైన చర్యలను కేంద్రం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. దీనివల్ల గడిచిన ఏడాది కాలంలో విదేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాదులను భారత్‌కు రప్పించగలిగారు. మరోవైపు బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ అమ్మకాలపై ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట ఉగ్రదాడి జరిగి ఏడాది పూర్తయిన వేళ దేశవ్యాప్తంగా భద్రతా దళాలు హై అలర్ట్‌లో ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట పేలుడు జరిగి ఓ ఏడాది గడిచిన నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఏడాది కాలంలో సరిహద్దు అవతల నుంచి సాగుతున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు భారీ దాడులు జరిపాయి. వీటిల్లో 300 మందికి పైగా ఉగ్రవాద ఆపరేటివ్‌లను అరెస్ట్ చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను భారతదేశానికి రప్పించారు. ఎర్రకోట పేలుడుతో ఇలాంటి దాడులను నివారించడానికి కేంద్ర నిఘా సంస్థలు ఒక విధానాన్ని రూపొందించాయి. ఈ ఆలోచనతోనే ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం'విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ విధానాన్ని ఉంటుందని 2026 సెప్టెంబర్ లో జరిగిన రాష్ట్ర డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ అధిపతుల ఉన్నత స్థాయి సమావేశంలో స్పష్టం చేసింది. ఈ 'ప్రహార్' వ్యూహంలో భాగంగానే పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్' పై దేశవ్యాప్తంగా దాడులు చేసి 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దాదాపు 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్‌లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఎన్‌బీఎన్ (గ్రూదీచీ) ను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించింది. అటు యువతలో వచ్చే ఉగ్ర ఆలోచనల ప్రవర్తన మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపాయి. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ఇప్పుడు అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలతో సహా అనేక నిబంధనలు అమల్లో ఉన్నాయి." అని ఓ అధికారి తెలిపారు. అదే సమయంలో కేంద్ర భద్రతా సంస్థలు అనేక ఆపరేషన్లు చేపట్టి తీవ్రవాద మాడ్యూళ్లను విజయవంతంగా నిర్మూలించాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జేవీ), లష్కర్-ఎ-తైబా (గ్రమ) వంటి నిషేధిత సంస్థల మద్దతు వ్యవస్థలను దెబ్బతీశాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తుల (గ్రఖజు)పై తీసుకున్న చర్యలు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్ వ్యూహాలను నిర్వీర్యం చేశాయి. దీనివల్ల సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల స్మగ్లింగ్‌కు అంతరాయం కలగడంతో పాటు, కీలకమైన వ్యక్తులను అరెస్టు చేశాయి.

ఏ హోదాకు వెళ్లినా మీ గతాన్ని మర్చిపోవద్దు - నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా రావొచ్చన్నారు. పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. అధికారుల నుంచి ప్రభుత్వం కోట్లు ఆశించట్లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని ఆదేశాలు కూడా ఇవ్వడం లేదన్నారు. బాధ్యత గుర్తించి నిజాయితీగా విధులు నిర్వర్తించాలని మాత్రమే ప్రభుత్వం కోరుకుంటుందని తెలిపారు. సర్వం ఒడ్డి శాంతిభద్రతలు కాపాడి, పోలీసుల గౌరవాన్ని సీనియర్లు పెంచారన్న సీఎం, పోలీసు శాఖ విశ్వాసమైన విభాగంగా కొనసాగించాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.



అవగాహన రాహిత్యంతో గతంలో తప్పులు

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో గతంలో ఉద్దేశపూర్వకంగా, అవగాహన రాహిత్యంతో తప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకొని అనుభవం, చిత్తశుద్ధి గల వ్యక్తులను బోర్డులో నియమించినట్లు తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్దస్థాయిలో గ్రూప్-1 పోస్టులు ఎప్పుడు ఇవ్వలేదని, తమ ప్రభుత్వ పారదర్శక నిర్ణయాల వల్లే మీకు అవకాశాలు వచ్చాయని చెప్పారు. 2011 నుంచి 2025 వరకు గ్రూప్ -1 నియామకాల ప్రక్రియ జరిగిందని గతంలో నోటిఫికేషన్, ప్రవేశ పరీక్షల విషయంలో గందరగోళం జరిగినట్లు గుర్తుచేశారు.

సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు

కొంతమంది పనిగట్టుకొని తెలంగాణలో గ్రూప్ -1 నియామకాల పట్ల ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. నియామకాల విషయంలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ఆరోపణలు రాజకీయంగా తమకేం కొత్త కాదని, తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రూప్ -1 నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు.

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు - కేబినెట్ కీలక నిర్ణయాలివే

మొదటి పేజి తరువాయి

ఉద్యోగాలు లభించనున్నాయి. అదానీ క్లౌడ్ హబ్ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నివేదికను కూడా పరిశీలించింది.

కేబినెట్ సమావేశానికి వస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఏఐ డేటా సెంటర్‌కు ఆమోదం : తిరుపతి జిల్లా నాయుడుపేటలో కార్బన్ కాస్మో సంస్థకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,000.20 కోట్లతో ఎల్ఎఫ్‌పీ ప్రీకర్సర్, క్యాథోడ్ మెటీరియల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. దీంతో 700 మందికి ఉపాధి లభించనుంది. తిరుపతిలో డిక్సన్ సంస్థకు కూడా అనుమతులు ఇచ్చింది. 700 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా 2,300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. భీమిలిలో అమానం సంస్థ ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. 512 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మొత్తం పెట్టుబడి 31,387 కోట్ల రూపాయలు. 1000 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు భూముల బదలాయింపు ప్రతిపాదనకూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రావలి స్పిన్నర్స్ పరిశ్రమ విస్తరణకు మంత్రివర్గం అనుమతులు ఇచ్చింది. 236.92 కోట్ల రూపాయల పెట్టుబడితో చేపట్టే దీని ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. టీటీడీలో కొత్త పోస్టులు : రాథీ గ్రీన్ ఎనర్జీ, న్యూల్యాండ్ ల్యాబ్స్ సంస్థలకు ప్రోత్సాహకాలు మంజూరు చేసే ప్రతిపాదనలకూ ఆమోదం తెలిపింది. విజయవాడలో 15 మెగావాట్ల వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రోజుకు 1,023 టన్నుల చెత్తను ఈ ప్లాంటులో ప్రాసెస్ చేయనున్నారు. ఇందుకు జెన్‌కోకు చెందిన 5.50 ఎకరాల భూమిని విజయవాడ నగరపాలక సంస్థకు ఉచితంగా బదలాయించనున్నారు. పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయనుంది. డీజీపీ పరిధిలో ఈ విభాగం పని చేస్తుంది. ఐజీ స్థాయి అధికారి డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు కొత్త పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన సన్నిధి యాదవ, అదనపు సన్నిధి యాదవ పోస్టులను మంజూరు చేసింది. దేవాదాయ శాఖ శిల్プ విభాగంలో చీఫ్ స్థపతి పోస్టు ఏర్పాటుకూ పచ్చజెండా ఊపింది.



రాజీవ్ గాంధీ దారుణ హత్య ఫోటోను ఇప్పటి వరకు చూడలేదు

మొదటి పేజి తరువాయి

మానవబాంబులా దాడి చేసింది. ఈ దుర్ఘటనలో రాజీవ్ సహా మరో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశ రాజకీయ చరిత్రలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ పేలుడు తర్వాత రాజీవ్ మృతదేహానికి సంబంధించిన ఫొటో అప్పటి పత్రికల్లో ప్రచురితమైంది. తర్వాత కూడా పలుమార్లు మళ్లీ మళ్లీ పత్రికలు ముద్రిస్తూనే ఉన్నాయి. అయితే ఇన్నాళ్లుగా ఆ ఫొటో తన కంట పడకుండా, తన పిల్లలు జాగ్రత్తగా చూసుకున్నారని పుస్తకంలో సోనియా గాంధీ పేర్కొన్నారు. 'నాకు ఏ దినపత్రికను లేదా మేగజైన్‌ను నేరుగా ఇవ్వకూడదని రాహుల్, ప్రియాంక- సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ఒక్కదానిని వారు మొదట నిశితంగా పరిశీలించిన తర్వాతే నా ముందుకు వచ్చేలా చూసుకున్నారు. ఆ సమయంలో నేను ఒక చిన్న పిల్లనైతే- రాహుల్, ప్రియాంకలు తల్లిదండ్రులై నన్ను కాపాడుకున్నారు. ముప్పై ఏళ్లు దాటినా నేను ఇప్పటికీ ఆ ఫొటోను చూడలేదు.'

- ఆత్మకథ బిలాంగింగ్‌లో సోనియా గాంధీ, సీపీపీ ప్రెసిడెంట్

'రాహుల్ నవ్వు చూసి ఆమె అలసట మాయమయ్యేది'

ఇదే పుస్తకంలో రాహుల్ గాంధీ బాల్యానికి సంబంధించిన



విశేషాలను కూడా సోనియా గాంధీ పంచుకున్నారు. పుట్టినప్పుడు చాలా సన్నగా ఉండి, తర్వాత బుగ్గలు, డబుల్ చిన్‌తో బొద్దుగా మారిన రాహుల్ అంటే కుటుంబంలో అందరికీ ఎంతో ఇష్టం ఉండేదని పేర్కొన్నారు. కుటుంబం మొత్తానికి, ముఖ్యంగా తన నానమ్మ ఇందిరా గాంధీకి అమితమైన ఆనందాన్ని ఇచ్చేవాడని చెప్పారు. రోజంతా రాజకీయాలు, దేశ వ్యవహారాలతో అలసిపోయి ఇంటికి వచ్చే ఇందిరా గాంధీ- రాహుల్‌ను చూడగానే ఒక్కసారిగా చిరునవ్వులు చిందించేవారని తెలిపారు. ఇందిరా గాంధీ ఇంటికి రాగానే రాహుల్‌ను ఎత్తుకొని ఆటలాడేవారని పాత జ్ఞాపకాల్ని గుర్తుచేసుకున్నారు. రాహుల్ ఆమెను గట్టిగా పట్టుకునేవాడని, జుట్టూ లాగేవాడని, దానికి ఆమె సంతోషించే వారని బిలాంగింగ్ పుస్తకంలో చెప్పుకొచ్చారు. రాహుల్‌కు కొంచెం ఆరోగ్యం బాగోలేకపోయినా ఇందిరా గాంధీ ఎంతో ఆందోళన చెందేవారని, ఎక్కడున్నా వాకబు చేసేవారని ప్రస్తావించారు.

రాహుల్ కంటే ముందు బాబు పుట్టాడు- కానీ ఒక్కరోజులోనే!

బిలాంగింగ్ పుస్తకంలో సోనియా గాంధీ తన వ్యక్తిగత జీవితంలోనే అత్యంత విషాదకర రహస్యాన్ని ప్రపంచానికి వెల్లడించారు. రాహుల్ గాంధీ కంటే ముందే మరో బాలుడు జన్మించి, ఒక్క రోజులోనే కన్నుమూసిన విషయం గురించి వివరిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆ పుస్తకంలో కథనం ప్రకారం- 1968 సెప్టెంబరులో సోనియా గాంధీ గర్భం దాల్చిన వార్త కుటుంబంలో ఎనలేని సంతోషాన్ని నింపింది. సాధారణంగా చాలా గంభీరంగా ఉండే ఇందిరా గాంధీ కూడా ఆ వార్త వినగానే భావోద్వేగానికి లోనై సోనియాను ఆప్యాయంగా హత్తుకున్నారు. అయితే గడువు తేదీ కంటే 2 నెలల ముందుగానే సాధారణ ప్రసవం ద్వారా 1969 జనవరి 18న పుట్టిన మగబిడ్డ మరుసటి రోజే మరణించాడు. ఆ పసికందు భౌతిక కాయాన్ని రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ కలిసి మెహ్రౌలీలోని ఫిరోజ్ గాంధీ ఫామ్‌హౌస్‌లో ఖననం చేశారని ఆ జ్ఞాపకాల్ని వెల్లడించారు.

ఢాకాలోని స్లమ్ ఏరియాలను దిల్లీలో ఉన్నట్లు చూపిస్తారా?'

మొదటి పేజి తరువాయి

చాలా దురదృష్టకరమని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. డబ్బులు ఇచ్చి లేదా విదేశీ శక్తులను వాడుకొని ఢాకాను దిల్లీగా చిత్రీకరించే ప్రయత్నాల వల్ల ఇలాంటి పనులు చేసేవారి నమ్మకత్వమే దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. ఈ తప్పుడు ప్రచారాలపై బంగ్లాదేశ్ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జైస్వాల్ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన 'ప్రోథోమ్ ఆలో' ప్రచురించిన ఒక పరిశోధనాత్మక నివేదిక ప్రకారం, సుమారు 150 మంది చైనా జాతీయులు ఢాకాలోని పేద ప్రాంతాలను చిత్రీకరిస్తూ వాటిని దిల్లీగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నట్లు వెల్లడైంది. చైనాకు చెందిన వ్లాగర్లు టెక్‌పారా, ఉత్తరతో సహా పలు ప్రాంతాల్లో చిత్రీకరిస్తూ, వాటిని భారత రాజధానిలోని భాగాలుగా చూపిస్తున్నారు. అక్కడి జీవన పరిస్థితులు, నివాసితులపై అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్నట్లు పేర్కొంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత మర్చంట్ నేవీ మాస్టర్ కెప్టెన్ అజయ్ పంత్ ఆరెస్టుపైనా రణ్ ధీర్ జైస్వాల్ స్పందించారు. "మేము కెప్టెన్ పంత్ న్యాయవాదులతో పాటు ఆయన కుటుంబంతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఆయన యోగక్షేమాలను తెలుసుకోవడానికి హైకమిషన్ పలుమార్లు కెప్టెన్ పంత్‌ను పరామర్శించింది. మేము ఆయన కుటుంబ సభ్యుల, ముఖ్యంగా ఆయన భార్య పర్యటనకు కూడా ఏర్పాట్లు చేశాం. ఆయన భార్య చివరిసారిగా నవంబర్ 9న సందర్శించారు. ఈ విషయంలో మేము ఇక్కడి యూకే హైకమిషన్‌తో పాటు యూకే విదేశాంగ కార్యాలయంతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఆయన భద్రత, శ్రేయస్సు కోసం మేము మా వంతు కృషి చేస్తున్నాం." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.



అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై తొలిసారిగా భారత్ స్పందన

మరోవైపు అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై భారత విదేశాంగశాఖ తొలిసారిగా స్పందించింది. ఈ ఎన్నికల ఫలితాలు భారత్- అమెరికా మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. భారత్- అమెరికా భాగస్వామ్యానికి రిపబ్లికన్ పార్టీ, డెమోక్రాట్ల నుంచి బలమైన మద్దతు ఉందని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఎన్నికల ఫలితాలపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమన్న ఆయన, ఇరు దేశాల మధ్య ఉన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇటీవలే జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ ఓటమిని చవిచూసింది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అసాధారణంగా గెలిచి అమెరికా చట్టసభలపై పూర్తి పట్టు సాధించారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న ప్రశ్నకు విదేశాంగశాఖ స్పష్టతనిచ్చింది. భారత్‌లో గురుద్వారాలు, చర్చిలు, మసీదులతో సహా మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకునే ఘటనలు పెరుగుతున్నాయని 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్') కమిషనర్ చేసిన వ్యాఖ్యలపైనా రణధీర్ జైస్వాల్ స్పందించారు. 'అనేది పక్షపాతంతో కూడిన, సరైన అవగాహన లేని సంస్థ. దీనికి స్పష్టమైన రాజకీయ ఎజెండా ఉంది. అమెరికాలో మతపరమైన ప్రదేశాలపై జరుగుతున్న దాడుల గురించి, అలాగే అక్కడ భారతీయ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ద్వేషపూరిత నేరాలు, జాతి వివక్ష ఘటనలపై దాని కమిషనర్లు ఎప్పుడూ మౌనంగానే ఉంటున్నారు.

వాయు కాలుష్యంలో ఎందుకు 'విశ్వగురువులం' అవుతున్నాం

మొదటి పేజి తరువాయి

దెబ్బతినడం, శిశు మరణాల ప్రమాదం పెరగడం వంటివి జరుగుతున్నాయని పరిశోధనలు వెల్లడించాయి."

'నిబంధనలను కఠినంగా అమలు చేయాలి'

2026 నాటి ఆర్‌టీఐ వివరాల ప్రకారం, దిల్లీ పర్యావరణ నష్టపరిహార వసూళ్లలో దాదాపు 60 శాతం, అంటే సుమారు రూ. 1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయని అన్నారు. 2025 డిసెంబర్ వరకు విడుదల చేసిన జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమ నిధుల్లో దిల్లీ కేవలం 17 శాతాన్ని మాత్రమే వినియోగించుకుందని ఆరోపించారు. మరోవైపు, కాలుష్య సంక్షోభాన్ని దీటుగా ఎదుర్కోవడానికి వివరణాత్మక నివేదికలు, ప్రతిపాదిత చర్యలను సమర్పించేందుకు బీజేపీ పాలిత దిల్లీ, హరియాణా, ఉత్తర్ ప్రదేశ్, రా

నవంబర్ 15న హలో రైతన్న చలో నల్గొండ.

- AIKS 36వ అఖిల భారత జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు

- సంగారెడ్డి లో రైతు సంగం బైక్ ర్యాలీ



(సంగారెడ్డి మండలం) నవంబర్ 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుండి 18 వరకు జరిగే 36 వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నేడు సంగారెడ్డి జిల్లా కేంద్రం సుందరయ్య భవన్ ఐలమ్మ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేయడం జరిగింది. ఇట్టి ర్యాలీ కి ముఖ్య అతిథిగా విచ్చేసిన రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమెరికాలో కుదుర్చుకున్న స్వేచ్ఛ వ్యాపార ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతులకు మద్దతు ధర ఇవ్వాలని మద్దతు ధర చట్టం తేవాలని అన్నారు.60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని సహకార సంఘాలను బలోపేతం చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని అన్నారు.కరువు వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరం 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని కార్పొరేట్ వ్యవసాయం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు,రైతు సంగం జిల్లా నాయకులు మల్లా రెడ్డి, విట్టల్, శ్రీనివాస్,అశోక్,శేఖర్, యాదగౌడ్, బాలరాజ్ తదితరులుపాల్గొన్నారు..

కరువు రైతులను ఆదుకునేందుకు కేంద్రం రూ.25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహా

(సంగారెడ్డి మండలం) నవంబర్ 10: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి తెలంగాణలో కరువు పరిస్థితులు ఏర్పడటంతో రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కరువు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.25 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహా డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ ధర్నాలో ఆయన మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించడంతో పాటు, ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలు, కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ఆర్. పాండుకు వినతిపత్రం అందజేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, సంగారెడ్డి జిల్లా ప్రజల తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా ప్రజలకు జీవనాధారమైన సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి జలవనరుల నిర్వహణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అన్నారు.జిల్లాలోని 28 కరువు ప్రభావిత మండలాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, రైతులు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, పేద కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం, ఉపాధి కల్పన, నిత్యావసర సరుకుల పంపిణీ, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఈటీ నర్సింహా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ప్రకాష్ రావు, జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, జిల్లా నాయకులు కే.



నరసింహులు, సయ్యద్ తాజుద్దీన్, షఫీ అహ్మద్, శంకర్, తిలక్, వరలత, బిపాషా, రజియా బేగం, సాధకలి, ముస్తఫా, పూలమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కీర్తి కుమార్, డీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం కిరణ్ కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కైతలాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సదర్ సమ్మేళనం

--బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి...



కుత్బుల్లాపూర్. నవంబర్. 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ...

కైతలాపూర్ చౌరస్తా లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి.. ఈ కార్యక్రమంలో యాదవ సోదరులు ఘనంగా సదర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. అనంతరం రవికి సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో తదితరులు యాదవ సంఘం సోదరులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు...

తెలుగు భాషా సాహిత్య పరిరక్షణలో బ్రౌన్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా సి.పి.బ్రౌన్ జయంతి వేడుకలు

విశాఖపట్నం, నవంబర్ 10: ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

విశాఖపట్నం ఆంగ్లమాత కన్నబిడ్డగా జన్మించి, ఆంధ్రమాత ముద్దుబిడ్డగా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు సి.పి.బ్రౌన్ అని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగుదండు ఆధ్వర్యంలో అక్షర తపస్వి, బహుభాషా కోవిదుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బ్రౌన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ, నిర్లక్ష్యానికి గురై కనుమరుగవుతున్న తెలుగు పదసంపదను సేకరించి, నిఘంటువుల రూపంలో భద్రపరిచి భావితరాలకు అందించిన మహనీయుడు బ్రౌన్ దొర అని కొనియాడారు. మాతృభాష పరిరక్షణకు ఆయన చేసిన సేవలకు తెలుగుజాతి యావత్తు కృతజ్ఞతలు తెలపాలని పేర్కొన్నారు.ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మరడాన సుబ్బారావు మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న తాళపత్ర గ్రంథాలను సేకరించి, తన సొంత నిధులతో పండితులు, లేఖకులను నియమించి తెలుగు సాహిత్య సంపదను పరిరక్షించిన మహనీయుడు సి.పి.బ్రౌన్ అని అన్నారు. ఆయన కృషి వల్ల తెలుగు సాహిత్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.ఇతర సాహితీవేత్తలు మాట్లాడుతూ, మహాభారతం, మనుచరిత్ర, వసుచరిత్ర వంటి గ్రంథాలు, వేమన పద్యాలు, తెలుగు అకారాది నిఘంటువుల పరిరక్షణకు బ్రౌన్ చేసిన కృషి అపారమని తెలిపారు. తన జీవితాన్ని, ఆస్తిని సైతం తెలుగు భాషా సాహిత్య వికాసానికి అంకితం చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట, గంట్ల శ్రీనుబాబు, అడపా రామకృష్ణ, రాజమన్నార్, పంతుల లలిత,



సత్యమాధవి, విజయలక్ష్మి, సుజాత, ఆచార్య శ్రీబాబు, ఆచార్య సూరప్పడు, చేబియ్యం మోహనరావు, బీవీకే కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కైసర్‌నగర్‌లో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్. నవంబర్.10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం పరిధిలోని కైసర్‌నగర్‌లో డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి గతంలోనే మంజూరైనప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా కొర్వి లక్ష్మి, మమతా, గౌసియా బేగమ్‌లకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ షఫీ, వలీభాయ్, సరితా యాదవ్, యాద్గిరి తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో వ్యాపారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

నిత్యావసర ధరల పెరుగుదలతో వ్యాపారాలు మందగించాయని ఎమ్మెల్యేకు వివరించిన వ్యాపారులు

(సంగారెడ్డి మండలం) నవంబర్ 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సదాశివపేట పట్టణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పర్యటించి, దీపావళి సందర్భంగా వివిధ వ్యాపార సంస్థల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని వ్యాపారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లోని వ్యాపారులను కలుసుకుని వారి సమస్యలు, మార్కెట్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, ఫలితంగా వ్యాపారాలు మందగించి చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెట్ పరిస్థితులపై కూడా వ్యాపారులతో ఎమ్మెల్యే చర్చించారు.ఈ కార్యక్రమంలో బసంతి, ర్యాగల్ల అశోక్, మల్లికార్జున సుధాకర్, బోనగిరి సంగమేష్, నిజాంపురం రవి అశోక్, భువనగిరి చందర్, విశ్వనాథ్ సంతోష్, సారపు శ్రీనివాస్, కిష్టప్ప సేతు, మొట్లకుంట నారాయణ రవి, జీర్లపల్లి వెంకన్న, మధుసూదన్, గాజుల కృష్ణ, సింగారం జగన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.అలాగే దిద్దిగే నగేష్, చీల మల్లన్న, మల్లికార్జున వంశీ, సంక్షయ్ గౌడ్, జగదీష్, చింత గోపాల్, అంజయ్య, నాగుల విజయ్, వీరేశం, కలీం పటేల్



తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి పీఎస్ లో పోలీసు విచారణకు హాజరైన అంబటి రాంబాబు



కాకినాడ జిల్లా కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో పోలీసు విచారణకు వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు. దివంగత నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై నమోదైన కేసులో ఆయన పోలీసుల ఎదుట విచారణను ఎదుర్కొంటున్నారు.కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూసిన అనంతరం జులై 15న ఆయన స్వగ్రామం కిర్లంపూడిలో అంత్యక్రియలు జరిగాయి. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ముద్రగడ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో (గార్డ్ ఆఫ్ ఆనర్) నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే, ముద్రగడ కుటుంబ సభ్యులు, వైసీపీ నేతలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు.పోలీసులు గౌరవ వందనం సమర్పించేందుకు ప్రయత్నించిన సమయంలో అంబటి రాంబాబు, ఆయన అనుచరులు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న సిబ్బందిపై తోసివేతకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్ఐ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కిర్లంపూడి పోలీసులు జూలై 16న అంబటి రాంబాబుతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా బీఎన్ఎస్-ఎస్ సెక్షన్ 35 కింద గుంటూరులోని అంబటి రాంబాబు నివాసంలో పోలీసులు నోటీసులు అందించారు. ఈ వివాదంపై గతంలో స్పందించిన అంబటి రాంబాబు... తాము ముద్రగడ చివరి కోరికను అమలు చేశామని, ఆ బాధ్యత తమ పైన ఉందని చెప్పుకొచ్చారు.

జీవీఎంసీలో తెన్నేటి విశ్వనాథం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళి...

- విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మహానేత తెన్నేటి విశ్వనాథం..

విశాఖపట్నం, నవంబర్ 10: ప్రజా న్యూస్ నెటవర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పి. ఎం.నాయుడు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే కాకుండా, విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు విశేష కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజానాయకుడు, మహానేత తెన్నేటి విశ్వనాథం అని జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి కొనియాడారు.తెన్నేటి విశ్వనాథం వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, ఇతర అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు మాట్లాడుతూ, తెన్నేటి విశ్వనాథం 1895లో విశాఖపట్నం జిల్లా లక్కవరం గ్రామంలో జన్మించారని తెలిపారు. చిన్ననాటి నుంచే దేశభక్తి, ప్రజాసేవ పట్ల ఆసక్తి కలిగిన ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, మహాత్మా గాంధీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించారని తెలిపారు. 1937లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర శాసనసభకు తొలిసారిగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. అనంతరం విశాఖపట్నం నుంచి లోక్‌సభకు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. పలు మంత్రి పదవులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మజ, జీవీఎంసీ పర్యవేక్షకులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత..

అభివృద్ధి నిరంతర ప్రక్రియ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సిద్ధార్థ నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్





(సంగారెడ్డి మండలం) నవంబర్ 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సంగారెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తానని సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ అన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సిద్ధార్థ నగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రహదారుల నిర్మాణంతో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గుతాయని, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, నక్క నాగరాజు గౌడ్, కౌన్సిలర్ నవీన్, జాఫర్, సురేష్, మున్సిపల్ అధికారులు, కాలనీ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో చరిత్ర సృష్టించిన భారత సంతతి వ్యక్తి..

- గ్రేటర్ బెండిగో మేయర్‌గా అభిషేక్ అవస్థి



ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రానికి చెందిన కీలక నగరం ‘గ్రేటర్ బెండిగో’ నూతన మేయర్‌గా భారత సంతతికి చెందిన అభిషేక్ అవస్థి (43) ఎన్నికయ్యారు. గ్రేటర్ బెండిగో సిటీ కౌన్సిల్‌కు మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి భారత సంతతి వ్యక్తిగా ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. నవంబర్ 9న జరిగిన సిటీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో 2026–27 కాలానికి గాను ఆయనను మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం స్థానిక ‘ది క్యాపిటల్ థియేటర్’లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దాదాపు 250 మంది అతిథుల సమక్షంలో అభిషేక్ అవస్థి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఒక సంవత్సరం పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. కాగా, నగర డిప్యూటీ మేయర్‌గా ఆండ్రియా మెట్‌కాఫ్ ఎన్నికయ్యారు. గతంలో అభిషేక్ అవస్థి డిప్యూటీ మేయర్‌గా సమర్థవంతంగా సేవలందించిన విషయం తెలిసిందే.మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అభిషేక్ అవస్థి ప్రసంగిస్తూ, తనపై సంపూర్ణ నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న తోటి కౌన్సిలర్లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఘనతను గ్రేటర్ బెండిగోను తమ సొంత నివాసంగా మార్చుకున్న వలసదారులందరికీ అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. తన ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంత ప్రయోజనాల కోసం నిరంతరం గళమెత్తుతూ, ఉజ్వల భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆయన తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా కూడా పంచుకున్నారు.

విద్యార్థి స్థాయి నుంచి మేయర్ పీఠం దాకా..

భారతదేశంలోని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మండి ప్రాంతం అభిషేక్ అవస్థి స్వస్థలం. ఆయన ఉత్తరప్రదేశ్ టెక్నికల్ యూనివర్సిటీ నుంచి బీటెక్ పూర్తి చేశారు. ఉన్నత విద్య కోసం 2008లో అంతర్జాతీయ విద్యార్థిగా ఆస్ట్రేలియా వెళ్లిన ఆయన, లా ట్రోబ్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2010లో బెండిగో నగరంలో స్థిరపడిన అవస్థి, 2015లో ఆస్ట్రేలియా పౌరసత్వం పొందారు.

స్థానిక కమ్యూనిటీలో చురుగ్గా పాల్గొంటూ, ప్రవాస భారతీయులను ఏకం చేయడానికి, సాంస్కృతిక, స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడానికి ఆయన ‘ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ బెండిగో’ను స్థాపించారు (దీనిని 2021లో అధికారికంగా నమోదు చేశారు). ప్రజలతో ఉన్న బలమైన అనుబంధంతో ఆయన 2024 నవంబర్‌లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కెన్నింగ్టన్ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించి, 2024–25 కాలానికి నగరంలోనే తొలి భారత సంతతి డిప్యూటీ మేయర్‌గా సేవలందించారు. ఇప్పుడు అదే నగరానికి మేయర్‌గా ఎన్నికై అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు.ప్రస్తుతం అభిషేక్ అవస్థి తన భార్య అనిమ, కుమార్తె అగ్నితో కలిసి బెండిగోలో నివసిస్తున్నారు. భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (బీబీఎంబీ) రిటైర్డ్ ఉద్యోగి అయిన ఆయన తండ్రి సురేంద్ర పాల్, తల్లి చంపా శర్మతో పాటు ఇతర బంధువులు కూడా ఈ ప్రమాణ స్వీకార వేడుకకు హాజరై సంతోషం వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై ఒక భారతీయుడు సాధించిన ఈ విజయం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

తమ కుమారుడి పెండ్లి పత్రికలు ఆలయాల్లో పెట్టి.. పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి దంపతులు

రుద్రారంలోని గణేష్ గడ్డ వినాయక ఆలయంలో తొలి పత్రిక పెట్టి పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి, నిర్మల

ఆలయాల్లో పూజలు చేసి.. బ్రాహ్మణుల ఆశీర్వచనాలు తీసుకున్న తూర్పు భరత్ సాయి రెడ్డి

16 ఆలయాల్లో పత్రికలు పెట్టి.. పూజలు చేసిన జగ్గారెడ్డి కుటుంబసభ్యులు

(సంగారెడ్డి మండలం) నవంబర్ 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

తమ కుమారుడు తూర్పు భరత్ సాయి రెడ్డి వివాహం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి, నిర్మల దంపతులు తమ కుమారుడిని వెంట బెట్టుకొని ఆలయాలకు వెళ్లారు. పెళ్లి పత్రిక దేవుళ్ళు, అమ్మవార్ల సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు.తొలి పత్రికను రుద్రారంలోని గణేష్ గడ్డ ఆలయంలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సంగారెడ్డిలోని అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, సంగమేశ్వర ఆలయం, భవానీ మందిరం, మాణిక్ ప్రభు మందిర్, లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, దుర్గమ్మ గుడి, ముత్యాలమ్మ గుడి, వడ్డె వీర హనుమాన్ మందిర్, శ్రీ వైకుంఠ పురం ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, నవరత్నాలయం, ఎర్ర పోచమ్మ గుడి, రామ్ నగర్, రామ్ మందిర్ ఇలా మొత్తం 16ఆలయాల్లో పత్రికలు పెట్టి.. పూజలు నిర్వహించారు.

తాతా – నానమ్మ ఫోటో వద్ద పత్రిక పెట్టి..

తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి

ఆలయాల్లో పత్రికలు పెట్టి పూజలు చేసిన అనంతరం జగ్గారెడ్డి దంపతులు రామ్ నగర్ లోని తమ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు భరత్ సాయిరెడ్డి తమ తాత– నానమ్మ చిత్రపటానికి నమస్కరించి, పెళ్లి పత్రికను ఫోటో వద్ద పెట్టారు. ఆ తర్వాత ఇంట్లోని పూజా మందిరంలో దేవతా విగ్రహాలకు నమస్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి తూర్పు భరత్ సాయి రెడ్డి వాళ్ల ఆశీస్సులు అందుకున్నారు..



తాడిపత్రిలో మళ్లీ రాజుకున్న రాజకీయం..

ప్రత్యర్థులకు జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీల సవాల్!



అనంతపురం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. 2021లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను, ప్రస్తుత తాజా ఫలితాలతో పోలుస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు స్థానికంగా పెను చర్చకు దారితీశాయి. ప్రత్యర్థి పార్టీ వైఖరిని ఎండగడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రశ్నల వర్షం కురిపించారు.ఈ ఫ్లెక్సీలలో వైసీపీ నేతలను ఉద్దేశించి తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. “2021లో మీకు కళ్లు దొబ్బాయా?“ అంటూ ఘాటైన వ్యాఖ్యలను ఫ్లెక్సీలపై ప్రదర్శించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌లను లక్ష్యంగా చేసుకుంటూ.. “మీకు కళ్లు, చెవులు పనిచేస్తే ఈ ఫలితాలను చూడండి“ అంటూ ఫ్లెక్సీల ద్వారా నిలదీశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరును, ఇప్పటి ఫలితాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ప్రతిష్ఠలను పూర్తిగా చెడగొట్టారని ఆయన మండిపడ్డారు. తాను జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలను శాశ్వతంగా రూపుమాపాలని గట్టిగా కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని జేసీ ఆరోపించారు. కుప్పం పురపాలక ఎన్నికల్లో తమిళనాడు నుంచి బస్సుల్లో దొంగ ఓటర్లను తరలించి మరీ వైసీపీ అక్రమంగా గెలిచిందని దుయ్యబట్టారు. అలా దొంగ ఓట్లతో గెలిచిన వైసీపీ నేతలకు ప్రస్తుతం ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత లేదని ఆయన కొట్టిపారేశారు. అనంతపురం జిల్లాకు చెందిన పలువురు కీలక వైసీపీ నేతలపై కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిల తీరును తప్పుబట్టారు. అనంతపురం జిల్లా ప్రగతి పథంలో సాగాలంటే వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి అనంత వెంకట్రామిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నైతికత ఉంటే వైసీపీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులందరూ ముందుగా తమ పదవులను వదులుకోవాలని సవాల్ విసిరారు. మరోవైపు, అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి జరగాలంటే, కొత్తగా మేయర్‌గా గెలిచిన రమేశ్‌గౌడ్ పార్టీ మారితే మంచిదని జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఐఏఎస్ అధికారి డా. యోగితా రాణిని కలిసి వినతి

హైదరాబాద్ మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి కె శివ కుమార్ నవంబర్ 10 :

(ప్రజా న్యూస్ నెట్‌వర్క్) ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా ఉపాధ్యాయుల కొరతపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐఏఎస్ అధికారి డా. యోగితా రాణి ని కలిసి వివరించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని పాఠశాలల్లో అవసరమైన స్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల



చదువులకు ఆటంకం కలుగుతోందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను తక్షణమే గుర్తించి, అవసరమైన చోట వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఎమ్మెల్యే కోరారు. విద్యా సంవత్సరం కొనసాగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే సరిపడా ఉపాధ్యాయులు, మెరుగైన విద్యా వసతులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

10,715 మంది ఉద్యోగుల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది: ఆలపాటి

రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థాగత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయం ప్రభుత్వ పాలనకు లభించిన స్పష్టమైన ప్రజా రెఫరెండం అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నికల పోస్టల్ బ్యాలెట్లలో ఏకంగా 63.6 శాతం మంది ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారని ఆలపాటి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావిస్తూ, అప్పట్లో దాదాపు రూ.40,000 కోట్ల బకాయిలు పెట్టి, రివర్స్ పీఆర్సీ పేరుతో వేతనాలు తగ్గించారని విమర్శించారు. ఉద్యోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నియమించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన దాదాపు రూ.30,000 కోట్ల బకాయిలను విడుదల చేసి ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించిందని ఆలపాటి వివరించారు. 2004 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన 10,715 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి తీసుకువచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు. ఉద్యోగుల పదవీ విరమణ



వయస్సు పెంపు, పీఎఫ్, డీఏ బకాయిల క్రమబద్ధీకరణ వంటి చర్యలతో ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఉద్యోగుల సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రజా న్యూస్ నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. తెలుగు దినపత్రిక
11,నవంబర్ బుధవారం 2026

సీఎం రియల్ ఎస్టేట్ బ్రోకర్ లాగా వ్యవహరిస్తున్నారు

– చిన్న చిన్న ప్లాట్లు కూడా అమ్ముతున్నారు.

– నీవు ప్రోగ్రెసివ్ ముఖ్యమంత్రివా ప్రజలను హింస పెట్టడానికి ఉన్నావా

– భూములను కాపాడలేక అమ్ముతున్నాం అని చెప్పడం అంటే నీది చేతకాని ప్రభుత్వం – ఈటల రాజేందర్, ఎంపీ

హైదరాబాద్ మేడ్చల్, మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి కె శివ కుమార్ నవంబర్ 10 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

కే పి హెచ్ బి కాలనీలోని ఫోరం మాల్ ఎదురుగా ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడాలని, వాటిని ప్రజా ప్రయోజనాలకే వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈటల కామెంట్స్ ముఖ్యమంత్రిగా ప్రజల ఆస్తులను కాపాడుతారని అనుకున్నాము కానీ. నరకం చూపిస్తున్న ఇలాంటి ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదు.

భూములు నీ జాగీరు కాదు

ప్రజలకు ఇల్లు కట్టిస్తామంటే రైతులు ఇచ్చిన భూమి ఇది. కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ ఏసియాలోని అతిపెద్దది పేదల కోసం ఈ హౌసింగ్ బోర్డ్ ఏర్పడింది.ఎకరానికి 2750 గజాల్లో మాత్రమే ఇల్లు కట్టాలి. కానీ కంచే చేను మేసినట్లు ప్రభుత్వం లేఔట్ చేశారు. కూకట్పల్లి అత్యధిక జనసాంద్రత ఉన్న కాలనీ. ఇలాంటి ప్రాంతంలో మిగిలిన ప్లాట్లను అమ్ముకోవడం మూర్ఖపు ప్రభుత్వం జ్ఞానం లేని ప్రభుత్వం. ప్రభుత్వ భూములను కాపాడేందుకు సుప్రీంకోర్టులో కూడా కొట్లాడుతున్నామని రేవంత్ రెడ్డి ప్రగల్ బాలు పలుకుతున్నారు కానీ ఇక్కడ చిన్న చిన్న ప్లాట్లను కక్కుర్తి పడి అమ్ముకుంటున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు గా వ్యవహరిస్తున్నారు.

ఒక వైపు ఫ్యూచర్ సిటీ అంటావు .ఇంకో వైపు ఇలాంటి కాలనీలలో భూములు అమ్ముకుంటున్నారు.గుడి కోసం బడి కోసం ఉండే స్థలాలు ప్రజలకు ఉపయోగపడతాయి.మీ నాయకుల అండదండలు లేకుండా.అధికారులు కబ్జాదారులు కుమ్మక్కు అవ్వకుండా భూములు కబ్జాకు గురికావు.ప్రజలు ఇప్పటికిప్పుడు నిన్ను తిట్టకపోవచ్చు కొట్టకపోవచ్చు కానీ ఇదా మా ప్రభుత్వం అని సిగ్గుతో తలదించుకుంటున్నారు ఓట్లు వేసిన వారే అసహ్యించుకుంటున్నారు. ఇప్పటికైనా సోయి తెచ్చుకో.ఈ ప్రభుత్వం ఉన్నవారికి కొమ్ముకాస్తుంది.ఒకప్పుడు 30 లక్షలు నివాసం ఉన్న హైదరాబాదులో.ఒక కోటి 70 లక్షల జనాభా అయ్యింది, ఇప్పటికే తాగే నీళ్లు లేవు రోడ్లు లేవు డ్రైనేజీలు లేవు అధ్వానంగా తయారయింది.

పిల్లలు డ్రగ్స్ కి సెల్ ఫోన్స్ కి బానిసలు కాకుండా ఉండాలంటే డైవర్ట్ అవ్వడానికి పిల్లలకు ఆట స్థలాలు ఉండాలి

రేవంత్ రెడ్డి బేషజాలకు పోకండి బిజెపి వాళ్ళ ధర్నాగా భావించకండి ఇది ప్రజల ఆవేదన అని అర్థం చేసుకోండి. వినకపోతే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారు.విర్రవీగిన వారికి, ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకున్న వారికి ఇప్పటికే ఆ గతి పట్టింది.మేము గండిపేటకి, హైటెక్ సిటీ,నానక్రామ గూడలో భూములు అమ్మ వద్దు అని రావట్లేదు.మేము అడ్డుకుంటుంది ఈ కూకట్పల్లిలో. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత ఎంపీగా అత్యంత జనసాంద్రత కల కూకట్పల్లిలో భూములు అమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను.భూముల వేలానికి వ్యతిరేకంగా ఇక్కడ ప్రజలు చేస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాను. ఈ ధర్నాలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఓడేపల్లి రాజేశ్వర్ రావు, కాంతారావు, ప్రీతం రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి యాదవ్, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ మహీందర్, కే పి హెచ్ బి డివిజన్ అధ్యక్షురాలు సులోచన, బాలాజీనగర్ అధ్యక్షులు వేణుగోపాల్, వసంత్ నగర్ అధ్యక్షురాలు రత్నకుమారి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





కరువు సాయంను వెంటనే ప్రకటించాలి.

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి‌ఎస్ బోస్ డిమాండ్.

- సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నేడు భారత కమ్యూనిస్టు పార్టీ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరువు వల్ల ఉపాధి కోల్పోతున్న

కుత్బుల్లాపూర్. నవంబర్.10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..





మరియు పంట నష్టం తో ఇబ్బంది పడే రైతులను కార్మికులను ఆదుకోవాలనే డిమాండ్ తో నేడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్ బోస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం వల్ల అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది కాబట్టి వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరువు వల్ల ఉపాధి కోల్పోయే పట్టణ ప్రాంత కార్మికులకు విభిజి రాంజీ ద్వారా ఉపాధి హామీని కల్పించాలని ,ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను ప్రజలకు ఉచితంగా అందించాలని, పంట నష్టపోయే రైతులకు కుటుంబానికి 50వేల రూపాయలు తక్షణ సహాయాన్ని ప్రకటించాలని, మంచినీటికి కొరత లేకుండా ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ను నిరంతరాయంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని పిలిచి తీసుకున్నటువంటి అభిప్రాయాలను తక్షణమే అమలు పరచాలని కేవలం సమావేశాలు నిర్వహించి ప్రకటనలకు పరిమితం కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్ని కూడగట్టి పెద్ద ఎత్తున పోరాటాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ఎల్ నినో అనే కరువు వల్ల నష్టపోతున్నది పేద, మధ్య తరగతి వరకు ప్రజలేనని కానీ దానికి ప్రధాన కారణం పర్యావరణ కాలుష్యం అని ఆ పర్యావరణ కాలుష్యానికి మైనింగ్ మరియు అడవుల నరికివేత వల్లే నని అన్నారు. అడవులను నరికివేసి, మైనింగ్ చేసే పెట్టుబడిదారులు అధిక లాభాలు అర్జిస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమై పేద ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారని కావున కేంద్ర ప్రభుత్వం పర్యావరణ కాలుష్య కారకులైనటువంటి పెట్టుబడిదారీ వర్గాలపై పన్నులను పెంచి, పేద ప్రజలపై ఉన్న పన్నును తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నీటి లభ్యత లేని రాష్ట్రాలకు మిగులు ఉన్న రాష్ట్రాల నుండి మంచినీటిని సరఫరా చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణ ప్యాకేజీని ప్రకటించి ప్రజలలో మనోధైర్యాన్ని నింపి వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం పైనే ఉన్నదని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులను అందించాలని బ్లాక్ మార్కెట్ కి కారణమైనటువంటి నూతన వ్యవసాయ చట్టాలను రద్దుచేసి రైతాంగానికి ఉపయోగపడేలా చట్టాలను చేయాలని పట్టణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి హామీ ద్వారా ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కరువును రాష్ట్ర ప్రభుత్వముల పై వదలకుండా కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చైతన్య గీతాలను ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డిజి సాయిల్ గౌడ్, కే ఏసురత్నం ,కే ధర్మేంద్ర మరియు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి అన్వర్,జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మి, రచ్చ కిషన్, కృష్ణ, సత్యప్రసాద్ ,వి శ్రీనివాస్, నిమ్మల నరసింహులు మహిళా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు హైమావతి ,మాధవి జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేంద్ర ప్రసాద్, అమరావతి బాబు, యాదగిరి ,దశరథ్, కాసర్ల నాగరాజు, బాపిరాజు , ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, వి వెంకటాచారి గౌరవ అధ్యక్షులు ప్రవీణ్ మహిళా సమైక్య నాయకురాలు గిరిజ, మహాలక్ష్మి లతా, నర్సమ్మ, సువర్ణ, కవిత, అనసూయ, జిల్లా పార్టీ నాయకులు వెంకటేష్, బాలరాజు, బాపిరాజు, నాగరాజు, ఇస్తారి, మహేష్, చంద్రయ్య, సత్యనారాయణ, బాబు,సదానందం, అజీమ్, కృష్ణ, నర్సయ్య లతో పాటు వందలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు.

రహదారి గుంటపై గరిడేపల్లి పోలీసుల తక్షణ స్పందన!

- వాహనదారుల భద్రతకు ప్రాధాన్యత.. స్వయంగా రంగంలోకి దిగిన ఎస్సై శ్రీకాంత్ గౌడ్!

- ప్రమాదాలకు కారణమవుతున్న గుంటకు మరమ్మతులు.. పోలీసుల చొరవపై ప్రజల హర్షం!

గరిడేపల్లి మండలం, నవంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

ప్రధాన రహదారిపై గుంటతో వాహనదారులకు ఇబ్బందులు

గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంట వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు గుంట కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గరిడేపల్లి పోలీసులు గుర్తించారు. రహదారిపై గుంట అలాగే ఉంటే వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ చర్యలు చేపట్టారు.

సమస్య తెలిసిన వెంటనే స్పందన.. పోలీసులే స్వయంగా మరమ్మతులు :



వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన ఎస్సై శ్రీకాంత్ గౌడ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రహదారిపై ఏర్పడిన గుంటను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి కంకర, మట్టిని వేయించి గుంటను పూడ్చివేయించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు గుంట కారణంగా ఎదురయ్యే ప్రమాద పరిస్థితి తొలగింది.

ప్రజల భద్రతే ప్రాధాన్యతగా పోలీసుల చొరవ :

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి ఆలస్యం చేయకుండా స్పందించి పరిష్కారం చూపిన ఎస్సై శ్రీకాంత్ గౌడ్, పోలీస్ సిబ్బందిపై వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతకు సంబంధించిన చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. రహదారులపై ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులు, శాఖలు సకాలంలో స్పందిస్తే ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గరిడేపల్లి పోలీసుల చొరవకు ప్రజల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయి.

కరువుతో నష్టపోయిన తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

₹25 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

దేవరకొండ, నేరేడుగుమ్మ. నవంబర్ 10 జట్టి శంకర్ ప్రజా న్యూస్.

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడటంతో తెలంగాణలో రైతాంగం, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి బొమ్ము రామాంజనేయులు డిమాండ్ చేశారు. నేరేడుగొమ్ము తాసిల్దార్ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించడంతో పాటు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అనంతరం ఇంచార్జ్ =× సునీల్ గారికి వినతిపత్రం అందించి పంట నష్టపోయిన రైతులను అదుకోవాలని, ప్రజలకు త్రాగునిరు, సాగునిరు సమస్యను పరిష్కరించాలని కోరారు.నీటి వనరుల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. పంట నష్టపరిహారం, ఉపాధి కల్పన, నిత్యావసర సరుకుల పంపిణీ, తాగునీటి సరఫరా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రజల కష్టాలు ప్రభుత్వాలకు పట్టకపోతే ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరిస్తూ, రైతాంగం, కార్మికవర్గం, పేద ప్రజల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూ× మండల కార్యవర్గ సభ్యులు మషాబోయినా బిక్షమయ్య, బెజవాడ లక్ష్మయ్య, బిక్షమయ్య, సైదులు, మంగు నాయక్, వెంకటయ్య, అంబలి, బామిని, వెంకటి, హనుమంతు, బురో, గణేష్, రమేష్, రతన్, కొండల్, శంకర్, శ్రీను, వెంకటమ్మ, అంజమ్మ, శ్రీకాంత్,కే. నరసింహులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు



జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం.

- అధ్యక్షులుగా జే. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లన్ కోటి శంకర్ ఎంపిక

నర్వ, నవంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :

నర్వ మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా ఎస్. సుదర్శన్ గౌడ్, అధ్యక్షులుగా జే. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా మల్లన్ కోటి శంకర్, ఉపాధ్యక్షులుగా ఎం. రఘు, భాస్కర్ రెడ్డి, కావలి పాండు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా ఎం. ఆంజనేయులు, ఎస్. రమేష్ గౌడ్, చెన్న రాయుడు, సంయుక్త కార్యదర్శులుగా వెంకట్ రెడ్డి, ఖాజా పటేల్, కోశాధికారిగా పోతిరెడ్డి శరత్ కుమార్ రెడ్డి, సహాయ కోశాధికారిగా వి. బాలస్వామి, ప్రచార కార్యదర్శిగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎల్. గణేష్, కె. శ్రీనివాసులు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతకు పెద్దపీట వేస్తూ వారి హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులందరినీ ఐక్యంగా ముందుకు నడిపిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.



ప్రజా న్యూస్ నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||

ఉమ్మడి సూర్యాపేట జిల్లాలో నేడు మంత్రి ఉత్తమ్ సుడిగాలి పర్యటన!

– కోట్లాది రూపాయల అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారుల్లో కదలిక!

– సాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత.. ప్రజలకు మెరుగైన వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి!



పనుల్లో జాప్యం లేకుండా.. ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు!

హుజూర్‌నగర్ మండలం, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు (నవంబర్ 11) ఉమ్మడి సూర్యాపేట జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో కోట్లాది రూపాయలతో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా వాటి పురోగతిని స్వయంగా సమీక్షించనుండటంతో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు నీటి భరోసా కల్పించడమే లక్ష్యం

ఉదయం 8.45 నుంచి 9.15 గంటల వరకు రెడ్లకుంట వద్ద రూ.47 కోట్లతో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను మంత్రి పరిశీలించనున్నారు. అనంతరం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు కోదాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను తనిఖీ చేయనున్నారు. రూ.54 కోట్లతో చేపడుతున్న రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులతో పాటు రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.50 కోట్లతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణాలను పరిశీలించనున్నారు. అలాగే షాదీఖానా నిర్మాణం, రూ.5 కోట్లతో నిర్మిస్తున్న నూతన ఇరిగేషన్ భవనం, రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ భవన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ పనులు పూర్తయితే విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పేదలకు మెరుగైన వైద్య సేవలు.. కోదాడలో మెగా కంటి వైద్య శిబిరం

ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు కోదాడలోని కాకతీయ సేవా సమితి కల్యాణ మండపంలో నిర్వహించే మెగా కంటి వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స అందించే అవకాశం కలగనుంది. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావడంలో ఇలాంటి శిబిరాలు కీలకంగా నిలవనున్నాయి.

రూ.400 కోట్ల జాన్‌పహాడ్ ప్రాజెక్టు.. సాగునీటి పనులపై ప్రత్యేక దృష్టి

మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు రూ.400 కోట్లతో చేపడుతున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, జనపహాడ్ కాలువ లైనింగ్ పనులను మంత్రి పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు రూ.40 కోట్లతో చేపడుతున్న బెట్టె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, చెక్‌డ్యామ్ పనులను తనిఖీ చేయనున్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఆయా ప్రాంతాల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉండటంతో ఈ పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. నిర్మాణాల స్థితిగతులు, పనుల వేగం, అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిశీలించనున్నారు.

ప్రజా కార్యక్రమంతో పాటు స్థానిక కుటుంబానికి పరామర్శ

మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు కరక్కాయలగూడెంలో స్వర్గీయ అంకతి పార్వతి పెద్దకర్మ కార్యక్రమానికి మంత్రి హాజరుకానున్నారు. అనంతరం తన పర్యటనలో భాగంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పరిశీలనకు బయలుదేరనున్నారు.

హుజూర్‌నగర్ విద్యా, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సమీక్ష

సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు హుజూర్‌నగర్‌లో మంత్రి పర్యటించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులతో పాటు నూతన ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ భవన నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖల కార్యకలాపాలకు అనువైన కార్యాలయ భవనాలు అందుబాటులోకి రావడం ఈ నిర్మాణాల ప్రధాన ఉద్దేశం. ఆయా పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణాల స్థితిగతులను సమీక్షించనున్నారు.

ఒకే రోజు ఉమ్మడి సూర్యాపేట జిల్లాలోని పలు కీలక ప్రాంతాల్లో మంత్రి పర్యటించనుండటంతో సాగునీరు, విద్య, వైద్యం, ప్రభుత్వ మౌలిక వసతుల రంగాల్లో కొనసాగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి పడనుంది. కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన ప్రాజెక్టులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా పూర్తై ప్రజలకు ఉపయోగపడేలా ఉండటం అత్యంత కీలకం. నిర్మాణాల నాణ్యత, పనుల పురోగతి, నిర్ణీత గడువులో పూర్తి చేసే అంశాలపై మంత్రి పరిశీలన చేయనున్నారు. రైతులకు సాగునీరు, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ప్రజలకు వైద్య సేవలు, ప్రభుత్వ శాఖలకు అవసరమైన కార్యాలయ భవనాలు అందుబాటులోకి రావడమే ఈ అభివృద్ధి పనుల ద్వారా ఆశిస్తున్న ప్రధాన ప్రయోజనం. ఈ పర్యటనతో ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులపై సంబంధిత శాఖల అధికారుల దృష్టి మరింత కేంద్రీకృతం కానుంది.

రైతులకు అండగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలి రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే సూచన

- ప్రతి రైస్ మిల్లులో రూ.3,500 తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రకటన





మిర్యాలగూడ నవంబర్ 10 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ నియోజకవర్గంలో ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో వెంటనే స్పందించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు...

ఈ సమావేశంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ హెచ్చరించారు..రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు...
అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి, మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైస్ మిల్లులో ధాన్యం క్వింటాల్‌కు రూ.3,500 తగ్గకుండా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు... ధాన్యం నాణ్యత బాగుంటే రూ.3,500 కంటే ఎక్కువ ధర కూడా చెల్లిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ధర కంటే తగ్గించి కొనుగోలు చేయబోమని రైతులకు హామీ ఇచ్చారు...రైతుల ఆందోళనను వెంటనే గుర్తించి, రైస్ మిల్లర్లతో చర్చించి రైతులకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండున్నరేళ్లలోనే రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం: గంటా



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగం సరికొత్త పుంతలు తొక్కుతోందని, రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం, ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలపై నమ్మకంతో దేశ విదేశీ పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బారులు తీరుతున్నారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.గత వైసీపీ పాలనలో తీసుకున్న విధ్వంసకర నిర్ణయాలు, పారిశ్రామికవేత్తలపై వేధింపుల కారణంగా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని గంటా విమర్శించారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లడంతో జగన్ హయాంలో దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం దాటి వెళ్లిపోయాయని ఆరోపించారు. ఆ ఐదేళ్ల కాలంలో కేవలం ఒకే ఒక్క పెట్టుబడుల సదస్సును మొక్కుబడిగా నిర్వహించారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రెండుసార్లు సీఐఐ (జ××) భాగస్వామ్య సదస్సులను విజయవంతంగా నిర్వహించి, ఏకంగా రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించిందని గణాంకాలతో వివరించారు. ఈ తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందని గంటా తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 8 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన దిశగా కీలక ముందడుగు పడిందన్నారు. దేశంలోనే అత్యుత్తమమైన 28 నూతన పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఫలితంగా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి నెలా ఒక భారీ పరిశ్రమ రావడం, భూమిపూజ లేదా ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగడం పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని చెప్పారు. సీఐఐ ప్రాంతీయ సదస్సుల ద్వారా మరో 1.50 లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమైందని ఆయన తెలిపారు.విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర పారిశ్రామిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవనుందని గంటా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి మరిన్ని భారీ ప్రాజెక్టులు రానున్నాయని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా ఉత్తరాంధ్ర ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి సాధించడం, యువతకు ఉపాధి కల్పించడం, పెట్టుబడిదారులకు పూర్తి భరోసా ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయమని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రోడ్డేది.. గుంతలమయమైన మార్గంలో ప్రయాణం ఎలా సాగాలి?

- తుమ్మలపల్లికరివిరాల రహదారిపై ప్రయాణికులకు నిత్యం నరకం!

- కంకర తేలిన రోడ్డు.. కమ్ముకున్న చెట్లు.. పట్టించుకునే అధికారులు ఎక్కడ?

మోతే మండలం, నవంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, యల్లారెడ్డి, మండల ప్రతినిధి :

గుంతల రహదారితో నిత్యం అవస్థలు.. కోదాడ ప్రయాణం భారంగా మారింది!

మోతే మండలంలోని తుమ్మలపల్లి నుంచి కరివిరాల మీదుగా కోదాడకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోదాడకు రాకపోకలు సాగించే పరిసర గ్రామాల ప్రజలకు ఈ మార్గం కీలకంగా ఉన్నప్పటికీ రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా, భారంగా మారింది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

రోడ్డును కమ్మేసిన చెట్లు.. దారి ఎక్కడుందో తెలియని పరిస్థితి!

రహదారికి ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరిగి రోడ్డుపైకి కమ్ముకోవడంతో రహదారి విస్తీర్ణం సరిగా కనిపించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రోడ్డుపై కంకర తేలిపోవడంతో వాహనాలు నడపడం కష్టంగా మారింది. గుంతలు, కంకర, రోడ్డుపైకి వచ్చిన చెట్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పరిస్థితి కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది.

వర్షం పడితే గుంతల్లో నీరు.. రాత్రివేళ ప్రయాణమంటే భయం!

వర్షం కురిసినప్పుడు రహదారిపై ఉన్న గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుంతలు నీటితో నిండిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారి సరిగా కనిపించకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి.. రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలి!

తుమ్మలపల్లికరివిరాల రహదారిపై నిత్యం ప్రయాణించే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి, కంకర తేలిన ప్రాంతాలకు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించి ప్రయాణానికి అనువుగా మార్గాన్ని సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కోదాడకు రాకపోకలు సాగించే గ్రామాల ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించేలా అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు



ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ అయిన 2027 మార్చి 31 వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ ముగిసే వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం అధికారిక జీవో విడుదల చేసింది.గతంలో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో 'అగ్ని' వెబ్ పోర్టల్ నిర్వహణలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు సంజయ్‌పై వచ్చాయి. అంతేకాకుండా, ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1.15 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ అభియోగాల నేపథ్యంలో, ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1969లోని రూల్ 3(1) ప్రకారం ప్రభుత్వం 2024 డిసెంబర్ 3న సంజయ్‌ను తొలిసారి సస్పెండ్ చేసింది. అనంతరం 2024 డిసెంబర్ 24న ఏసీబీ ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. మరోవైపు, సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. విచారణలు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు ఆయన సస్పెన్షన్‌ను సర్వీస్ ముగిసే వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.